# చిత్తగించవలెను

ముష్టికుక్కాడా పనికిరాని దాన్నయిపోయాను బాబూ, పనికిరాని దాన్నయిపోయాను. పాలిస్తున్నవారేం తక్కువ వారు కాదు. దేశ విదేశాల్లో పేరూ ప్రతిష్టా వున్న ఆర్థిక రాజకీయవేత్తలు.

ఇదిగో దినపత్రికసారూ. చూడండి. ఇవిగో 'పతాక' శీర్షికలు!

'మన గ్రోత్‌రేట్ చాలా సంతృప్తకరంగా వుంది. మన మార్కెట్లు చాలా బలంగా బాగున్నై. (అచ్చుతప్పు కాబోలు - బలవంతంగా బాగున్నై)! ప్రభుత్వం నా తీరు వలన ఆర్థిక మాంద్యాన్ని అద్భుతంగా ఎదుర్కోగలిగాం. ఏ సమస్యాలేక ప్రతిపక్షాలు అనవసరమైన రాద్ధాంతాలు చేస్తున్నాయి! ఆత్మస్తుతీ, పరనిందా!!

❖ ❖ ❖

సాయిబాబా టెంపుల్ పేవ్‌మెంట్ హక్కుల బాబులాంటి హక్కు- అంటే మాటలా? అమెరికా పేటెంట్ హక్కుల బాబులాంటి హక్కు.

'బలే పెద్ద మనిషివమ్మా. వద్దులే పద. నేనంత పనికిరాని దానిలా కనబడుతున్నానా? పదిరూపాయలకాగితమిస్తే, పోన్లే అని మొహాన్నకొంటనిదాన్ని.జ అదిగో ఆ చివర కుష్టుదుంది చూసుకో".

మొహం పగిలింది. గూబ గుయ్యిమంది!

కుళ్ళిపోయింది దేహభాగాలా? దేశ భాగాలా? అవును.

జాగా జాగాకీ రేట్లుంటయ్. రేట్లు మారుతూనే వుంటయ్!!

భాగో ...భాగో....

❖ ❖ ❖

ఆరేళ్ల అనాధ బతుకుని చీకటి పేవ్‌మెంట్ మీద కుళ్ళ బొడిచింది. అరవై ఏళ్ళ కామం.

ఓరి దుర్మార్గుడా!

పిల్ల అంగీలో -కూరి పారిపోతున్నావ్. ఇందుకా నా ఉనికి? ఇదా నా బతుకు?

నీది దయా? ధర్మమా? రాస్కెల్.

న్యూసూ, వ్యూసూ చెలరేగినై. రెచ్చిపోయినై. ఇరవై నాలుగంటలూ, రణగొణధ్వనీ, రాళ్ళవానా! మేకప్ మొహాల చర్చలే చర్చలు!

అంతా గుడిపైడి జంగాలు!

మర్నాటికి కొత్త కథ కోసం వేట.. పబ్‌ల బాట! నా సంగతేవిటి?!

❖ ❖ ❖

గల్లీలో పండగ దందాలూ, చందాలూ! మాల్స్‌నుంచీ కార్పొరేట్స్‌దాకా బలవంతపుపార్టీ ఫండ్స్!

నగదు బాబూ, నగదు! అక్కడా నాకు ఉనికీ లేదు. ఊసూలేదు. తోసెయ్; పక్కకి తోసెయ్, న్యూసెన్స్! లెఖ్ఖ కష్టం!

కాదన్నవాడి నోరూ, కారూ ఖలాస్!

ఆరుకోట్ల ఆఫీస్ బిల్డింగ్ ఆరు నిముషాల్లో శ్మాష్! చూసేవాడికి ఉచిత వినోదం, రక్షక భటుడికి భయం, భయం.... 'నేను డ్యూటీలో లేను' తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ!

❖ ❖ ❖

'మా అమ్మ ఇచ్చింది సారూ. చాలా కష్టపడి కూలిచేసి తెచ్చింది సారూ. తీసుకోండి. ప్లీజ్, నాకు నోట్‌బుక్ చాలా అవసరం సార్. ఇవ్వాళ తీసుకుపోకపోతే క్లాస్‌రూమ్ గోడవారగా రెండుగంటలు నిలబడాలని సార్. ప్లీజ్ సార్, ప్లీజ్!

'అరె, ఏమిరా ఈనస. సతాయింపు. కుదర్దు. లేదుపోరా అంటే కాదు తీసుకోమంటావ్. ఛల్....ఛల్..."

శ్రీమహాలక్ష్మీ స్టేషనరీ షాప్ యజమాని! సరస్వతి కాగితాల్తో చిల్లర పోగేసిన కంత్రీ! రూపాయికొకటి చొప్పన విడివిడిగా అమ్మేస్తున్నాడు. దేశమాత (పటం)ని! నేను మాత్రం వాడికీ కానిదాన్నయిపోయాను!

❖ ❖ ❖

'కోటాకోటిక్కెట్టు'

'దీన్నెక్కడ్నుంచీ తెచ్చావ్? చిల్లరదియ్'

'లేదు సారూ...'

'దిగవయ్యా... దిగు... పొద్దున్నే వెధవగొడవ...' ఈలమీద ఈల. బస్ ఆగింది. ఆసామీ దిగులు దిగులుగా దిగిపోయాడు.

ఇదీ వరస!

❖ ❖ ❖

'రేపివ్వండి సార్..ఫర్వాలేదు'. పాలబూత్ యజమాని. చేతిలోకి కూడా తీసుకోలేదు. చూసీ చూడంగానే మొహం తిప్పుకున్నాడు.

అవును

ఎందుకూ పనికిరానిదాన్నయిపోయను బాబూ... పనికిరానిదాన్నయి పోయాను.

❖ ❖ ❖

పండ్లబండి చుట్టూరా వున్నారు కొనేవాళ్ళు. ఆడామగా, బేరాలు సాగుతున్నై. కొందరికి జవాబు వస్తోంది. కొందరికి విసుగూ, విసురూ ఎదురుదెబ్బలై తగుల్తున్నై.

'నీది కొనే బేరం కాదులే,. పోవమ్మా!' అతని మొహంలో చిరాకు. ఆమె మొహం చిన్నబోయింది. నిమ్మళంగా కదలి వెళ్ళిపోయింది.

"రెండు అరటి పళ్ళివ్వండి. ఇక్కడే తింటా" ఇచ్చాడు. ఇతనూ డబ్బిచ్చాడు. బండి అతని చూపుల్లో ఈటె. "దీన్నెక్కడ తెచ్చావ్ భాయ్. నహీచలేగా, ఔర్ ఏక్ దో"

క్షణం సేపు విభ్రమం. మరో క్షణం సేపు నిశ్శబ్దం. ఇతని మొహం మీది 'ఎందుకనీ?' ప్రశ్నని పెదవులు ప్రసారం చేసినై.

"అరె... భాయ్. నహీ చలేగా. బస్. బేరాలటైమ్. మీరు వెళ్లండి".

విసుగుదలని అమ్మకపు నైపుణ్యంలో హొదిగించాడు. పక్కనున్న పెద్దమ్మ అందుకుంది. "తీసుకోబాబూ, పండ్లివ్వు. ఇక్కడే తింటానంటున్నాడు. పాపం, ఆకలో ఏమో?!

"మీకేం కావాలో చెప్పండి." ఆయన సంగతి నీకెందుకమ్మా - అనే అర్థం ఇమిడే ఉంది.

ఆమె ఏమీ కొనకుండానే పక్కకి జారుకుంది. ఇతను బండిని చూశాడు. బండివాడినీ చూశాడు బండి చుట్టూ వున్న మనుషుల్ని చూశాడు. దిక్కులు చూశాడు. కడకు పక్కకు నడిచాడు.

ఆకలి... నిరాశ...

అసలు విరిగిపోయిన పాలు. అందులో నూనెచుక్కలు! వికారమైన కదలిక.

ఒక సంఘం అవ్యక్త నిరసన - 'ఛీ... ఛా...'లతో ముద్దకట్టిపోయింది.

❖ ❖ ❖

ఆకుకూరల బండి. రోజూ కొనుగోలు చేసే సరుకు, అమ్మకందారు పేరు 'చండి'! ఎరుగున్న మొహం.

పలకరింపు నవ్వు. భావ ప్రసరణం జరిగిపోయింది. బేరం సాగింది. పనికిరాని మాటల్లో పనికిరాని జ్ఞానం. లోకరీతి, రావాజూ - లోకాభిరామాయణం! మెంతికూర కట్టలు, చేతులు మారాయి. ఇచ్చింది ఇంటావిడ. చూసింది చండి. చండి కళ్ళల్లో పరీక్ష.

చెప్పాను కదా- ఎవ్వరికీ పనికిరాని దాన్ని.జ చండి అసలే ప్రాసయుక్త యువతి - మొండి! వద్దే వద్దంది! 'నే గుర్తుంచుకుంటాన్లెండి. రేపు తీసుకుంటా' చర్చ... వాదం.. వివాదం... మాటతీస్తే మాట! 'పో.. అయితే... పో...." ఇంటావిడ ఉపసంహారం. బండి తోసుకుంటూ చండి, ముందుకు... తనను తాను తిట్టుకుంటూ ఆమె, ఇంట్లోకి... గాలి దుర్వాసనని మోసుకొస్తోంది.

❖ ❖ ❖

అరవై ఏళ్ళ విశ్రాంత ఆచార్యుడు. ఇరవై యేళ్ళ న్యూస్ పేపర్ స్టాల్ యువకుడు. చొరవగా పేపర్ కదిలింది.

యువకుడు తీసుకోనంటున్నాడు. ఆచార్యుడు తీసుకోవలసిందేనంటున్నాడు. వాగ్వాదం.

పోలీస్ కంప్లెయింట్ ఇస్తానన్నది 'పరిణత' మేధ.

'పోండి సార్. మీ యిష్టమొచ్చిన చోట చెప్పుకోండి' అనేసింది వయసువాడి. పేపర్ యథాస్థానం ప్రవేశించింది!

ఆవేశం పైకీ కిందకీ! చూచువారలకు చూడముచ్చట!

పతాక శీర్షికని చదువుకున్నై ఆచార్యుని చూపులు.

'అమ్మ అంటే బూతు మాట. తెలుగుపై నిషేధం'

'ఏమయిపోతోంది మాతృభాష?' వివరాలు వేరే పేజీలోకి వెళ్ళాయి. ఆచార్యులవారి కడుపు మరీ మండింది. మనసు మరీ మరీ రగిలిపోయింది. ఎంతెంత మార్పు? మార్పులకోసం, మార్కు కోసం వాచకాల్లో ఎన్నెన్ని నీచకాలు? వీధి(న) బడి(ంది)

తెలుగు - తెగులు, 'యాగీ' మిగిలింది!

కార్పొరేట్ విద్య బోగికి కోట్లు, కోట్లు!!

❖ ❖ ❖

సమాజానికి గుడ్లు చేతికొచ్చినై.

కొంచెం కొంచెం వాంతులూ, కొంచెం మించిన బేదులూ! మనిషి బుర్రలో మకిలీ, మందితల, ఊపూ!

మొన్నా, నిన్నా, నేడూ, రేపూ.... 'కాలం ప్రవాహశీలం' కలది..., కలవాడు.... ఎట్‌సెట్రా... గలగల!

కలలు... కలలు... 'కథ మిగిలింది, కల చెదిరింది.'!

నిజం.. నిజం.... భయం... భయం...

ఇంతకు మించీ ఆలోచిస్తూనే వుండండి- నా గురించి. ముష్టికొక్కడా పనికిరానిదాన్నయిపోయాను బాబూ, పనికిరాని దాన్నయిపోయాను!

ఏమో - మీలాగే,

నాదీ వానపాము బతుకై పోయిందా? బతుక్కి మరి పెద్ద పెద్ద పోలికలు నప్పవు!

అరె... స్టాప్ ప్రెస్' ఒక్క క్షణం.జ.. అటు చూడండి...

ఆ బతుకు ముందు పేవ్‌మెంట్ మీద చెక్కబోర్డు!

నాకు స్వాగతం... సాదరపూర్వక ఆహ్వానం-

'ఇచ్చట ఐదు రూపాయల నోట్లు తీసుకోబడును'!

అనూహ్య పరిణామంగా అదిరిపోకండి బాబూ.

వ్యాపారం... వ్యాపారం... మారకపు విలువలో ఏ మంత్రమూ, మర్మమూ లేవుట. నా కుంటి నడక విలువ - నాలుగు రూపాయలుట! మొహం విలువ ఎప్పుడో మాడిపోయిందిట! 'ఛీ... ఛీ... సిగ్గులేదు'! మీకా నాకా?!!'

(ఈ కథానిక 'కొలేజ్' అనే నిర్మాణ రీతిలో రాయబడింది. కథానిక శిల్ప విధానాల్లో ఇది కూడా ఒకటి. ప్రయోగశిల్పం నమూనాల్లో ఒకటి. ఈ పద్ధతిలో తెలుగులో తక్కువ కథలు వచ్చాయని - సుప్రసిద్ధ కథకుడు, విమర్శకుడు శ్రీఆడెపు లక్ష్మీగారూ, సుప్రసిద్ధ కథకులు తత్వవేత్త శ్రీబియస్ రాములుగారూ, 1980వ దశకంలో ఒకటి రెడు కథలురాశాను. ఆ పత్రికల కోసం వెదుకుతున్నాను. ఇప్పుడు మళ్ళీ ఇలా... ఒక బతుకు గీత వచ్చింది చిత్తగించవలెను' ఇందులో అంతరార్థ కథాశిల్పమూ ఒదిగి వుంది. రచయిత)

-చినుకు మాసపత్రిక, జనవరి 2011

కథా నిలయం
6665
KB2-3
శ్రీకాకుళం